
క్లుప్తంగా

గోవిందరాజుకు సత్కారం

రాజోలు: స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టరు(సీఐ)గా బాధ్యతలు నిర్వహించి బదిలీ అయిన ఆర్.గోవిందరాజును బుధవారం సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. తాటిపాకలోని సోమిశెట్టి ల్యాండ్‌మార్క్‌లో జరిగిన సత్కార సభలో సీఐ గోవిందరాజు సేవలను కొనియాడుతూ పలువురు ప్రసంగించారు. రాజోలు, నగరం, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్సైలు పి.రాజేష్‌కుమార్, సురేష్, రాము, సంపత్, పృథ్వీ పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంఈఓగా వెంకటేశ్వరరావు



అయినవిల్లి: మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ–1గా కె.వెంకటేశ్వరరావు బుధవారం నియమితులయ్యారు. ఎంఈఓ–1 పోస్టులో జేవీ కనకదుర్గ ఉద్యోగ విరమణ పొందడంతో ఖాళీ అయింది. ఆ పోస్టులో అంబాజీపేట మండలం ఎంఈఓ–1గా కొనసాగుతున్న కె.వెంకటేశ్వరరావును అయినవిల్లి ఇన్‌చార్జ్ ఎంఈఓ–1గా నియమించారు. ఆయన్ను ఎస్టీయూ నాయకులు, సీఆర్పీలు, పలువురు ఉపాధ్యాయులు కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు.

సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలిగా రమణకుమారి



సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన రమణకుమారిని అభినందిస్తున్న సర్పంచ్‌లు

మామిడికుదురు: మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలిగా నగరం గ్రామ సర్పంచ్ జాలెం రమణకుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఇంత వరకు సమాఖ్య అధ్యక్షుడిగా కొనసాగిన లూటుకుర్రు సర్పంచ్ అడబాల తాతకాపు పి.గన్నవరం నియోజకవర్గం సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో అతని స్థానే రమణకుమారిని ఎన్నుకున్నారు. సమాఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన రమణ కుమారిని మండలంలోని సర్పంచ్‌లు అభినందించారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రెండు కిడ్నీలు పాడైపోయి అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు బుధవారం రూ.35,500ను ఆర్థిక సాయంగా అందజేశారు. రావులపాలెంకి చెందిన రాజమహేంద్రవరం మణికంఠకు రెండు కిడ్నీలు పాడైపోయాయి. గత రెండేళ్లుగా డయాలసిస్ చేయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల మణికంఠకు సుగర్ ఎక్కువ అవడంతో ఎడమకాలును మోకాలి వరకూ వైద్యులు తొలగించారు. ఈయనకి ఇద్దరు ఆడపిల్లలు వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యులు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సహాయం చేయమని కోరారు. సంస్థ సభ్యులు మణికంఠ ఇంటికి వెళ్లి రూ.35,500 నగదు, 50 కేజీల బియ్యం అందజేశారు.

సభా వేదిక నిర్మాణానికి రూ.8 లక్షల విరాళం

మామిడికుదురు: మొగలికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ప్రవాసాంధ్రుడు దివంగత కాశిన సుధాకర్, గీత దంపతుల స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.8 లక్షలతో సభా వేదిక నిర్మించారు. 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు రూ.15 వేలతో బీరువా కొని స్కూల్‌కు అందించారు. చాడేశ్వరి చిట్‌ఫండ్ కమిటీ రూ.15 వేలతో మరో బీరువాను అందించింది. ఆరుమిల్లి వెంకటసుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె ఆదిలక్ష్మి రూ.15 వేలతో మరో బీరువాను అందించారు. 1991–92లో పదో తరగతి చదివిని పూర్వ విద్యార్థులు రూ.75 వేలతో కంప్యూటర్, ప్రింటర్, స్పీకర్, యూపీఎస్, కంప్యూటర్ టేబుల్, ఇన్వర్టర్ అందించారు. రిటైర్డ్ ఎల్ఐసీ డీఓ ఎంవీవీకే దుర్గారావు విద్యార్థుల యూనిఫామ్స్ కోసం రూ.25 వేలు విరాళంగా అందించారని స్కూల్ హెచ్‌ఎం పి.శ్రీనివాసచక్రవర్తి తెలిపారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట: గ్రామాల్లో పేద వర్గాలకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వృద్ధాప్య, వితంతు తదితర సామాజిక పింఛన్లు, సంక్షేమ పథకాలు సద్వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

- సమరయోధులను స్మరించుకుందాం
- ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఘనంగా ఏర్పాట్లు

కొత్తపేట: భారత స్వాతంత్ర్య దినోత్సవానికి డివిజన్ కేంద్ర కొత్తపేటతో పాటు క్లస్టర్ పరిధిలో సర్వం సిద్ధమయ్యారు. బ్రిటిష్ వారి కబంధ హస్తాల్లో ఉన్న భారతదేశాన్ని పోరాడి సాధించుకున్న దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొనేందుకు నాటి సమరయోధులను స్మరించుకునేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు, కార్మిక సంఘాల కార్యాలయాలు వద్ద ఏర్పాట్లు చేశారు. ఆయా సంస్థల వద్ద చట్ట సభల ప్రతినిధులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు మువ్వన్నెల జెండా ఆవిష్కరిస్తారు.

స్వాతంత్ర్య చరిత్ర పుటల్లో కొత్తపేటకు ప్రత్యేక స్థానం

భారత స్వాతంత్ర్య చరిత్ర పుటల్లో పూర్వ కొత్తపేట తాలూకాకు ప్రత్యేక స్థానం ఉంది. నియోజకవర్గానికి చెందిన ఎందరో యోధులు స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రవేశించి బ్రిటిష్ సాయుధ బలగాలకు ఎదురొడ్డి నిలిచి, వెన్ను చూపకుండా పోరాడారు. వారిలో అనేక మంది ప్రాణాలు విడిచారు. ఇంకా అనేక మంది జైలు జీవితాలు గడిపారు.

వారిలో వత్సవాయి ఆంజనేయవర్మ, పోడూరి వెంకటరత్నం, తురగ పురుషోత్తం, బండారు వెంకటరాజు, దేవులపల్లి సూర్యనారాయణమూర్తి, కళా వెంకట్రావు తదితరులు ఉన్నారు. ఇలా కొందరే చరిత్ర పుటల్లోకి ఎక్కగా చరిత్ర పుటల్లోకి ఎక్కనివారెందరో ఉన్నారు. వారిలో దాట్ల పద్మనాభరాజు ఒకరు. ఆయన మహాత్మా గాంధీతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపారు. ఆయన రాట్నంపై వడికిన నూలుతో నేసిన దుస్తులనే ధరించేవారు. ఆయనకు రాట్నంపై ఉన్న మక్కువ చూసి పద్మనాభరాజుకు గాంధీ స్వయంగా ఒక రాట్నాన్ని బహూకరించారు. ఇప్పటికీ ఆ రాట్నం తన కుమారుడు సూర్యనారాయణరాజు వద్ద ఉంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నాటి సమరయోధులను స్మరించుకోవలసిన బాధ్యత భారతీయులందరిపైన ఉంది.



కొత్తపేట మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం



దాట్ల పద్మనాభరాజు (ఫైల్)

అమరుల నేల వాడపల్లి

ఆత్రేయపురం: 1931 స్వాతంత్ర ఉద్యమంలో ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకన్న ఉత్సవాల్లో దేశ భక్తి కట్టలు తెంచుకుంది. గాంధీజీ పిలుపు మేరకు పరిసర ప్రాంతాలకు చెందిన నాయకులు రథోత్సవంలో దేశ సమైక్యతను చాటే స్వరాజ్య జెండాను, గాంధీజీ చిత్రపటాన్ని స్వామి వారి రథంపై ఉంచేందుకు ప్రయత్నించారు. దీంతో బ్రిటీష్ సైన్యం జరిపిన కాల్పుల్లో ముగ్గురు అమర వీరులు కాగా మరో 12 మంది గాయాల పాలయ్యారు. వారి దేశభక్తి గుర్తుగా వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వాతంత్ర్య సమరయోధుల స్మారక చిహ్నాన్ని ఏర్పాటు చేశారు.



వాడపల్లిలో స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం

ప్రతి గ్రామానికీ తాగునీరు అందించడమే లక్ష్యం

ముగిసిన శిక్షణ తరగతులు

మామిడికుదురు: ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే లక్ష్యమని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ముగింపు సభలో బుధవారం ఆయన పాల్గొన్నారు. రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇచ్చానని తెలిపారు. ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నామన్నారు. మొదటి సారిగా మండల పరిషత్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే వరప్రసాద్‌ను ఎంపీపీ కుసుమ వనజకుమారి, ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల రెడ్డి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఏఓ కె.వెంకటేశ్వరరావు, ఈఓపీఆర్డీ అడబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అలమూరు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గత మూడు రోజుల నుంచి పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల శిక్షణ తరగతులు బుధవారంతో పూర్తయ్యాయి. శిక్షణకు హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులకు ప్రశంసా పత్రాలు, శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. సర్పంచ్‌లు తమ్మన శ్రీనివాసు, సంగిత సుభాష్, కట్టా శ్రీనివాసు, గుణ్ణం రాంబాబు, ఈఓపీఆర్డీ రాజ్‌కుమార్, ఏఓ వి.రామ్‌స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంబాజీపేట: ప్రతి గ్రామంలోనూ వీధి లైట్లు వెలిగేలా సర్పంచ్‌లు, కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.సరోవర్ అన్నారు. అంబాజీపేట ఎంపీపీ కార్యాలయంలో సర్పంచులకు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గత మూడు రోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.మమత, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రావులపాలెం: గత మూడు రోజులుగా మండలంలోని సర్పంచులకు కార్యదర్శులకు ఇస్తున్న రిఫ్రెషర్ శిక్షణా తరగతులు బుధవారం మూడో రోజుతో ముగిశాయి. చివరి రోజు సర్పంచులకు రాత పరీక్ష నిర్వహించి ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి టి వి రాజేశ్వరరావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఈఓపీఆర్‌డీ కృష్ణ, ఏవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: మండలంలోని గ్రామాల సమగ్రాభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పని చేయడం ద్వారా సత్ఫలితాలు సాధించాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. మండలంలోని గ్రామ సర్పంచ్‌లు, కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగిన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో సంబంధిత ప్రజాప్రతినిధి, అధికారి సమష్టి కృషితో ఆయా సంస్థలు అభివృద్ధి పథంలో నడుస్తాయన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు బూసి జయలక్ష్మి, రెడ్డి చంటి, దూనబోయిన నవదీప తదితరులు పాల్గొన్నారు.

కొత్త తహసీల్దార్ల నియామకం



సఖినేటిపల్లిలో తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న నాగలక్ష్మమ్మ

కొత్తపేట: స్థానిక తహసీల్దార్‌గా యడ్ల రాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలిలో తహసీల్దార్‌గా చేసి అక్కడి నుంచి ఇటీవల జిల్లా కలెక్టరేట్‌లో ఏఓగా బదిలీపై వచ్చారు. మండలాలకు తహసీల్దార్ల నియామకాల్లో భాగంగా రాంబాబు కొత్తపేట తహసీల్దార్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరణ సందర్భంగా ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, డీటీలు ఆర్ దుర్గారామచంద్రమూర్తి, ఐ.సంధ్య తదితరులు అభినందించారు.



కొత్తపేట తహసీల్దార్ రాంబాబును అభినందిస్తున్న ఆర్ఐ తదితరులు

సఖినేటిపల్లి తహసీల్దార్‌గా నాగలక్ష్మమ్మ

సఖినేటిపల్లి: స్థానిక తహసీల్దార్‌గా సీహెచ్ నాగలక్ష్మమ్మ బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు డీటీ సీహెచ్ భాస్కర్, రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ వి.రామరాజు, వీఆర్వో బొల్లాప్రగడ సీతారామం ఆమెకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. పలువురు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రాజోలు తహసీల్దార్‌గా ప్రసాద్

రాజోలు: స్థానిక తహసీల్దార్‌గా ఎస్ఎస్ఎస్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం నుంచి రాజోలు వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను కార్యాలయ సిబ్బందితో పాటు వీఆర్వోలు, వీఆర్ఏలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.



రాజోలు తహసీల్దార్ ప్రసాద్

దాతల సహకారంతో ఆలయాల అభివృద్ధి

మామిడికుదురు: దాతల సహకారంతో ఆలయాలు ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందుతున్నాయని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో దాత మద్దుల పుల్లేశ్వరగుప్తా, సావిత్రి దంపతులు రూ.4.50 లక్షలతో నిర్మించిన శయన మందిరం (అద్దాల శాల)ను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన రిబ్బన్ కట్ చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ ప్రముఖ దేవాలయాలను ఆధ్యాత్మికంగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ చేపట్టామన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యే సత్యనారాయణకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి మహదాశీర్వచనం అందుకున్నారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, పార్టీ నేతలు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు, మెండా ఆదినారాయణ, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.



అప్పనపల్లిలో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

జాతీయ స్థాయి కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ

అలమూరు: స్థానిక విద్యార్థులు జాతీయస్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో చక్కని ప్రతిభను కనబర్చి అవార్డులను సాధించారు. ఇటీవల విజయవాడ పటమటలోని కార్పొరేషన్ ఇండోర్ స్టేడియంలో బుధవారం జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో ఫైటింగ్ జూనియర్స్‌లో మన్విత్ నాయక్ (గోల్డ్ మెడల్) సబ్ జూనియర్ (ఏ) విభాగంలో జస్వంత్ నాయక్ (సిల్వర్ మెడల్), వైట్ బెల్ట్ ఫైటింగ్ (బి) విభాగంలో క్రిశాంత్ నాయక్ (సిల్వర్ మెడల్) సాధించారు. అత్యంత ప్రతిభ కనబరిచిన ఈ విద్యార్థులంతా స్థానిక ఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్లిన ఎస్సై శ్రీను నాయక్ కుమారులని గోల్డెన్ డ్రాగన్ చైనీస్ సీనియర్ మాస్టర్ నార్గాని చంద్రకుమార్ తెలిపారు. మార్షల్ ఆర్ట్స్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు, గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, మాస్టర్లు కె.సత్తిబాబు, చల్లా సుధీర్ కుమార్, నామన దుర్గాప్రసాద్ తదితరులు అభినందించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా..

మలికిపురం: లక్కవరం గురయ్య కళాశాలలో హర్ ఘర్ తిరంగా యాత్ర బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ వీధుల్లో భారీ త్రివర్ణ పతాకం పట్టుకొని, విద్యార్థులు గుండెలపై తివర్ణ పతాకం ధరించి, భారత్ మాతాకీ జై అంటూ ప్రదర్శన చేశారు. యాత్రను కళాశాల కరస్పాండెంట్ మంగెన వెంకట సత్య ప్రసాద్ ప్రారంభించి, అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

భారతదేశం ఆకారంలో..

రావులపాలెం: ఆజాదీకా అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు భారతదేశం ఆకారంలో కూర్చుని జాతీయ జెండాను ప్రదర్శిస్తూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. విద్యార్థుల్లో దేశభక్తిని చాటేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్టు ఎన్ఎస్ఎస్ అధికారి అరుణ్ కుమార్ తెలిపారు.

అలమూరు: హర్ ఘర్ తిరంగాలో భాగంగా ఆలమూరు శాఖా గ్రంథాలయంలో బుధవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. తిరంగా ప్రతిజ్ఞలో భాగంగా లైబ్రేరియన్ టి.నమశ్శివాయ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు, పాఠకులు జాతీయ జెండా సమున్నతత్వాన్ని గౌరవిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఎందరో వీరుల త్యాగఫలం మన స్వాతంత్రం అని పలువురు వక్తలు తెలియజేశారు.

అంబాజీపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాచవరం పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ శాంతకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, పోటీలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ జాతీయ జెండాను ఇంటిపై ఎగురవేయాలన్నారు. ఆనాటి త్యాగమూర్తులను స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

అయినవిల్లి: మండలం వీరవల్లిపాలెంలోని ముద్రగడ నాగయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విద్యార్థులు గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. భారతమాతకు జై అంటూ, స్వాతంత్ర్య పోరాట నాయకులు పేర్లను కీర్తిస్తూ ర్యాలీ నిర్వహించారు.

మలికిపురం: హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా కేశనపల్లి హైస్కూల్ నుంచి మెయిన్ సెంటర్ వరకు విద్యార్థులతో ఎన్డీఏ హైస్కూల్ కమిటీ చైర్మన్ అడబాల ఏసుబాబు ఆధ్వర్యంలో నాయకులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాపాక సత్యనారాయణ, ఎండీఏ నాయకులు పాల్గొన్నారు. అలాగే చింతలమోరి ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో కూడా 300 మీటర్ల జాతీయ జెండాను ఊరేగించారు.

మామిడికుదురు: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బియ్యం గింజలతో నెహ్రూ చిత్రానికి విద్యార్థులు జీవం చేశారు. మగటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ టీచర్ గాలిదేవర రామకృష్ణ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులు షేక్ హబీబీ షానియా, గుండుపల్లి అమృతవల్లి, రావూరి పూర్ణ, బొంతు సాయిశ్రీ, మోటూరి జ్యోతి, వర్ధనపు హీభ చిత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, హెచ్ఎం బి.సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం అప్పనపల్లిలో బుధవారం నిర్వహించారు.



చింతలమోరిలో 300 మీటర్ల జెండా ఊరేగింపు



భారతదేశం ఆకారంలో జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

డ్వాక్రా సంఘాల బ్యాంకు ఖాతాలు తరలించాలి

అలమూరు: జొన్నాడలోని డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ఖాతాలను అదే గ్రామంలోని యూనియన్ బ్యాంకుకు తరలించాలని బ్యాంక్ మేనేజర్ వై.అజయ్ ప్రభుకుమార్‌కు గ్రామస్తులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. స్థానిక టీడీపీ నేతలు తాడి శ్రీనివాస్ రెడ్డి, గొడవర్తి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పలు మహిళ సంఘ నేతలు స్థానిక యూనియన్ బ్యాంకుకు వెళ్లి డ్వాక్రా సంఘాలు తరలించకపోవడం వల్ల కలిగే ఇబ్బందులను వివరించారు. గ్రామంలో దాదాపు ఆరు వేల మంది జనాభా కలిగిన దాదాపు 1500 మందితో కూడిన 150 సంఘాలు గ్రామంలో ఏర్పడ్డాయన్నారు. అప్పటి నుంచి ఆలమూరులోని యూనియన్ బ్యాంకు ద్వారానే లావాదేవీలు జరపడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గత పదేళ్ల కిందటే నూతన బ్రాంచ్‌ని నెలకొల్పినా డ్వాక్రా సంఘాలకు ప్రయోజనం లేదన్నారు. ఇకనైనా బ్యాంకు అధికారులు దృష్టి సారించి డ్వాక్రా సంఘాల ప్రయోజనాలను కాపాడాలన్నారు.